కలియదున్నితే కలదు బలం


వరికొయ్యలను తగలబెడితే భూసారానికి నష్టం

మేలు చేసే సూక్ష్మజీవులు, కీటకాలు నశిస్తాయి

కాలుష్యంతో పర్యావరణానికీ ముప్పు

పొలంలోనే కలియదున్నాలంటున్న నిపుణులు

7



సంధ్యా వేళ.. ప్రకృతి చిత్రకళ

సూర్యాస్తమం వేళ ఆకాశమంతా ఎర్రటి తివాచి పరిచి, నీటి అలలపై ప్రతిబింబమై మెరుస్తూ ప్రకృతి చిత్రకళను చూపిస్తున్నది. ఈ దృశ్యం గురువారం సాయంత్రం కొండపాక మండలం బందారం గ్రామ శివారులో కనిపించింది.

- కొండపాక, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి)

చలి..వణుకు

ఉమ్మడి జిల్లాలో కొనసాగుతున్న తీవ్రత

కోహీర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీలు

కోహీర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లాను చలి వదలడం లేదు. ఎనిమిది రోజులుగా పలు ప్రాంతాల్లో పది డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. నవంబరు 13 నుంచి ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు ప్రాంతాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌లో నమోదవుతున్నాయి. గురువారం 23 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో అత్యల్పంగా 7.4 డిగ్రీలు నమోదైంది. మెదక్ జిల్లా నర్సాపూర్ 8.7 డిగ్రీలు నమోదవగా, సిద్దిపేట జిల్లా పోతిరెడ్డిపేట 9.2 డిగ్రీలుగా రికార్డయింది. సిద్దిపేట జిల్లాలోని హబ్సీపూర్ 9.4, కొండపాక 9.5, అంగడికిష్టాపూర్ 9.8, బేగంపేట 9.9 డిగ్రీలు నమోదయ్యాయి. మునిగడప, మిరుదొడ్డి, తుక్కాపూర్, రాంపూర్, నంగునూరు, చిట్యాలపల్లి, గౌరారం, దౌలతాబాద్‌లో 11 డిగ్రీల లోపు నమోదయ్యాయి.



లంబసింగి కాదు.. రామప్పగుట్ట..!

లంబసింగిది కాదు.. అరకు వ్యాలీ అంతకంటే కాదు.. మన ఇస్లాంపూర్ రామప్పగుట్ట. తూప్రాన్ మండలంలో మూడు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో పొగమంచు భారీగా కురుస్తున్నది. గుట్టపైనుంచి చూస్తే మేఘాలు కిందకు వచ్చాయన్నట్లు కనిపిస్తున్నది. గుట్టపై వెలసిన స్వయంభు భవానీ రామలింగేశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఈ సుందర దృశ్యాన్ని ఆస్వాదిస్తున్నారు.

- తూప్రాన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి)

మిత్తి మీరుతోంది


చిన్న వ్యాపారుల నడ్డి విరుస్తున్న డైలీ ఫైనాన్స్ దందా!

గజ్వేల్‌లో వడ్డీ వ్యాపారుల అవతారంలో ఉపాధ్యాయులు

కొంతమందిని నియమించుకుని వడ్డీ వసూళ్లు

ఒక్కరోజు ఆలస్యమైనా చక్రవడ్డీ, బారువడ్డీ విధింపు

చిరువ్యాపారులకు ముద్ర రుణాలపై బ్యాంకుల కొర్రీలు.. తప్పక వీరి వైపు



ఎండనకా, వాననకా రోడ్ల పక్కన బతుకుదెరువు చేసుకునే చిరువ్యాపారుల కష్టం, శ్రమను వడ్డీ వ్యాపారులు దోచుకుతింటున్నారు. వారి అవసరాన్ని ఆసరాగా చేసుకుని చెలరేగిపోతున్నారు. రోజువారీ మిత్తిని వసూలు చేస్తూ వడ్డీ వ్యాపారులు కోట్లకు పడగలెత్తుతుంటే... కాయకష్టం చేసే వీధివ్యాపారి, చిరువ్యాపారి మాత్రం వడ్డీలు కడుతూ చితికిపోతున్నారు.

- గజ్వేల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి)

వడ్డీ వ్యాపారులు వీధి వ్యాపారులు, పాన్‌షాప్‌లు, కిరాణా దుకాణదారులు, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులను లక్ష్యంగా చేసుకొని రూ.10 వేల నుంచి రూ.5 లక్షల వరకు సీడీ (చిట్ ఫండ్/డైలీ ఫైనాన్స్) పద్ధతిలో రుణాలు ఇస్తున్నారు. రూ.10 వేలు అప్పుగా ఇస్తే, మొదట్లోనే వంద రోజుల వడ్డీతో పాటు పేపర్ ఛార్జీ, ఆ రోజు వడ్డీని కలిపి సుమారు రూ200 వరకు కట్ చేసి, కేవలం రూ.8800 మాత్రమే చేతికి ఇస్తున్నారు. వంద రోజుల పాటు రోజుకు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. అప్పు ఇచ్చే ముందు వినయంగా మాట్లాడే వడ్డీ వ్యాపారులు, ఒక్కరోజు గడువు దాటితే అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఒక్కరోజు కూడా వాయిదా చెల్లించలేని పక్షంలో బారు వడ్డీ, చక్రవడ్డీ విధిస్తూ పేద రక్తాన్ని తాగుతున్నారు.

పాన్ బ్రోకర్లదీ అదే తీరు

గజ్వేల్‌లో పాన్ బ్రోకర్లు సైతం అధిక వడ్డీల వసూళ్లకు పాల్పడుతున్నారు. పత్రాలపై రాసే వడ్డీ రేటు ఒకటి కాగా, వసూలు చేసేది అంతకు రెట్టింపు ఉంటోంది. జిల్లాలో లైసెన్స్ లేకుండా అక్రమంగా వ్యాపారం చేసే పాన్ బ్రోకర్లు అధికంగా ఉన్నారు. బంగారం తాకట్టుపై రుణాలు ఇచ్చే వారు సైతం సాధారణంగా రూ.5 వరకు, కాస్త ఆలస్యమైతే రూ.వీ వరకు వడ్డీని

మిగతా 8వ పేజీలో

వడ్డీల దందాలో ప్రభుత్వ ఉపాధ్యాయులు


గజ్వేల్ పట్టణంలో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు సైతం నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారులుగా అవతారమెత్తారు. దాదాపు పది మంది వరకు ప్రధాన వ్యాపారులు (ఉపాధ్యాయులతో సహా ఇతరులు) కోట్లలో వ్యాపారం చేస్తుండగా, మరో 40 మంది వ్యాపారులు లక్షల్లో ఈ దందాను కొనసాగిస్తున్నారని చిరువ్యాపారులు వాపోతున్నారు. వసూళ్లకు ప్రత్యేకంగా ఒక బ్యాచ్‌ను నియమించుకొని, చెల్లించని వారి వద్దకు పంపి బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధిక వడ్డీ వసూలు చేయడం చట్ట ప్రకారం నేరమైనప్పటికీ, వీరు ఏమాత్రం భయం లేకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. ఇటీవల సిద్దిపేట జిల్లా టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాలపై రుణాలు ఇచ్చి, వాహనాలను స్వాధీనం చేసుకున్న ఓ వ్యక్తిని రిమాండ్ చేసిన ఘటన ఈ దందా తీవ్రతకు అద్దం పడుతోంది.

ధర..దడ

ఇసుక వ్యాపారుల దోపిడీ.. డబుల్ రేట్లకు విక్రయాలు

నిర్మాణ రంగానికి అత్యంత కీలకమైన ఇసుక ధరలు అమాంతం పెరిగిపోయి, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో లేకుండా పోయాయి. గతంలో టన్ను ఇసుక ధర రూ.1500 వరకు ఉండగా, ప్రస్తుతం రూ.2500పైగా వరకు పలుకుతోంది. ఈ ధరల పెరుగుదల కారణంగా జిల్లాలోని నిర్మాణ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది.

- సిద్దిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి)



కృత్రిమ కొరత సృష్టిస్తున్న వైనం

పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ శాఖలు

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కరువు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి తప్పని కష్టాలు

ధరల పెరుగుదలను ఆసరాగా తీసుకుని, ఇసుక వ్యాపారులు సందెట్లో సడెమియాలాగా కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. రాత్రి వేళల్లో ఇసుకను తరలించి, డంప్ చేసి, డిమాండ్‌ను బట్టి టన్ను ధరను పెంచుతూ అడ్డగోలుగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాల వల్ల తవ్వకాలకు అంతరాయం కలగడం కూడా వ్యాపారులకు మరింత దోపిడీకి అవకాశం కల్పిస్తోంది. ఈ అక్రమ విక్రయాలపై మైనింగ్ శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు కనీసం కన్నెత్తి కూడా చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లనే వ్యాపారులు మరింత రెచ్చిపోతున్నారని భవన నిర్మాణ యజమానులు ఆరోపిస్తున్నారు.

ఉపాధి కోల్పోతున్న 30 వేల మంది

జిల్లా వ్యాప్తంగా దాదాపు 30 వేల మందికి పైగా భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. స్థానికులతో పాటు వివిధ రాష్ట్రాల

మిగతా 8వ పేజీలో



కొమురవెల్లి స్వామివారి చిత్రం చుట్టూ వెలిగించిన దీపాలు

కొమురవెల్లి క్షేత్రంలో కార్తీక శోభ

కొమురవెల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా కొమురవెల్లి మల్లన్న ఆలయంలో నిత్య దీపారాధనలో భాగంగా శుక్రవారం మహామండపంలో దీపోత్సవం నిర్వహించారు. కళాకారులు వేసిన మల్లన్న స్వామి, అమ్మవార్ల చిత్రాల చుట్టూ దీపాలను వెలిగించి పూజలు చేశారు. ఆలయాధికారులు, అర్చకులు, మహిళల పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనుల్లో వేగం పెంచాలి

జిల్లా కారాగారాన్ని పూర్తిగా సిద్ధం చేయాలి

త్వరలో సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభం

కలెక్టర్ హైమావతి

నంగునూరు/సిద్దిపేట అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ, జిల్లా కారాగారం నిర్మాణ పనులను వేగంగా పూర్తిచేయాలని కలెక్టర్ హైమావతి అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె నంగునూరు మండలం నర్మేట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని, సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో 34 ఎకరాల విస్తీర్ణంలో రూ.78 కోట్లతో నిర్మించిన జిల్లా కారాగారం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీలో బీటీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనుల వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్డు వెంట ఉన్న చెట్ల పొదలు తొలగించాలన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం సందర్భంగా పబ్లిక్ మీటింగ్ కోసం వివిధ జిల్లాల నుంచి ప్రజల సమీకరణ కోసం వాహనాల ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ కోసం ఫ్యాక్టరీ పక్కనే గల టీజీఐఐసీ స్థలంలో భూమిని చదును చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీఎం రానున్న నేపథ్యంలో వీవీపీ పార్కింగ్, హెలిప్యాడ్‌ను సిద్ధం చేయాల్సిందిగా అర్అండ్‌బీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సీఎం పర్యటనకు కావలసిన అన్ని అనుమతులు తీసుకుని ప్రారంభానికి సంబంధించిన పనులను పక్కా ప్రణాళికలతో పగడ్బందీగా సిద్ధం చేయాలని ఆయిల్ ఫెడ్ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. కారాగారం పూర్తయినట్లుగా సబ్‌జైల్ ఎస్ఐ వికాస్, ఇంజనీరింగ్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. కారాగారం లోపల, బయట చేయాల్సిన చిన్నచిన్న పనులు సైతం పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయం పక్క నుంచి కనెక్టివిటి అప్రోచ్ రోడ్ వేసేందుకు కేవీ ప్రిన్సిపల్, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులతో చర్చించడం కోసం పాత దస్త్రాలతో తన వద్దకు రావాలని తెలిపారు. ఆమె వెంట ఆర్డీవో సదానందం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి, ఆయిల్ ఫెడ్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, ఆయిల్ ఫెడ్ ఇంజనీర్ శ్రీకాంత్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



కారాగారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితా ప్రదర్శన



తీగుల్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఓటర్ జాబితా ప్రదర్శిస్తున్న కార్యదర్శి

జగదేవ్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితా ప్రతిని అన్ని గ్రామ పంచాయతీ(జీపీ) కార్యాలయాల వద్ద ప్రదర్శించామని ఎంపీడీవో రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పంచాయతీల వారీగా ఓటరు జాబితాను కార్యాలయాల వద్ద అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటరు జాబితాపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అసంపూర్తి రోడ్ల పనులను పూర్తిచేయాలి

● బెజ్జంకిలో బీఆర్ఎస్ నాయకుల అర్ధనగ్న నిరసన!



బెజ్జంకిలో అర్ధనగ్నంగా ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

బెజ్జంకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం మంజూరు చేసిన రోడ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ రోడ్లను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బెజ్జంకిలో బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసన స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. గురువారం బేగంపేట నుంచి బెజ్జంకికి ర్యాలీగా వస్తున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులకు, నాయకులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించడంతో, మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలి నుంచి బీఆర్ఎస్ నాయకులు అర్ధనగ్న ప్రదర్శనతో ర్యాలీగా బయలుదేరి నిరసన తెలిపారు. ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకుని, పలువురు నాయకులను పోలీసుస్టేషన్‌కు తరలించారు. రోడ్లు పూర్తి కాకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. మానకొండూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ రోడ్లు వేస్తామని రెండేళ్లుగా చెబుతున్నా, అభివృద్ధి చేయడంలో విఫలమయ్యారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని, చిత్తశుద్ధి ఉంటే వెంటనే రోడ్ల పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనలను తీవ్రతరం చేస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డితో పాటు శ్రీనివాస్ గుప్తా, లక్ష్మణ్, తిరుపతి, శేఖర్ బాబు, తిరుపతిరెడ్డి, దేవయ్య తదితర నాయకులు, కార్యకర్తలు హెచ్చరించారు.



సిద్దిపేట ప్రభుత్వ బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న సైన్స్ ఫెయిర్‌లో నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

భళా.. బాల వైజ్ఞానిక ప్రదర్శన

7

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా నిలుస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి సూచించారు. 58వ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. కేడం లింగమూర్తి మాట్లాడుతూ అత్యాధునికంగా గ్రంథాలయంను అందుబాటులో తెస్తామన్నారు. విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలని, ఇష్టంగా చదువుతూ ముందుకు సాగాలన్నారు. వినూత్న ఆలోచనలతో నూతన ఒరవడి సృష్టించాలన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యాశాఖ సూపరింటెండెంట్ రాజేశ్వరి, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం, కవి చొప్పదండి సుధాకర్, న్యాయవాది మనోహర్, మామిడాల స్రవంతి, గ్రంథాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అందజేసిన ప్రశంసాపత్రాలు

యువకుడి అదృశ్యం



నల్ల పరమేశ్

చేగుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేగుంట మండల పరిధిలోని వడియారం గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైన సంఘటన చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నల్ల పరమేశ్(25) ఈ నెల 18న అర్ధరాత్రి ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. రెండు రోజులుగా బంధువుల వద్ద, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి నల్ల యాదమ్మ గురువారం చేగుంట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్కీడ్రా పేరుతో వసూళ్లు.. ఇద్దరిపై కేసు



లక్కీ డ్రా కోసం ముద్రించిన కరపత్రం

జగదేవ్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లక్కీ డ్రా పేరుతో డబ్బు వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు జగదేవ్‌పూర్ ఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ధర్మారం గ్రామానికి చెందిన క్రాంతి కొండపోచమ్మలోని తన 120 గజాల ప్లాట్‌ను కేవలం రూ.500కే లక్కీ డ్రా ద్వారా ఇస్తున్నట్లు సోషల్ మీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో ఇన్‌ఫ్లూయెన్సర్‌తో ప్రచారం చేయించి కొంత మంది వద్ద డబ్బులు వసూలు చేశాడు. అదేవిధంగా జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన ఖలీం 195 గజాల ఇంటి స్థలాన్ని కేవలం రూ.1499 కూపన్ కొనుక్కొని సొంతం చేసుకోవాలంటూ ప్రచారం నిర్వహించి డబ్బు వసూలు చేశాడు. ప్రజలను తప్పుదారి పట్టిస్తూ కూపన్లు విక్రయించడం ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్ ఆక్ట్ ప్రకారం నేరమని, ఈ మేరకు వారిద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కూపన్ల పేరిట లక్కీడ్రా పేరిట ప్రజలను మోసం చేయాలని చూస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఎస్సై సూచించారు.

రేకుల షెడ్‌పై నుంచి పడి కార్మికుడి మృతి

పటాన్‌చెరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కంపెనీలో షెడ్‌పైభాగంలో రేకులు మారుస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడి ఓ కార్మికుడు చనిపోయిన సంఘటన ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ రాష్ట్రం బక్సర్ జిల్లా కేంద్రానికి చెందిన కృష్ణాసింగ్‌జీ ఐడీఏ బొల్లారంలో నివాసం ఉంటూ స్థానిక పారిశ్రామికవాడలోని రాణా డైకాస్ట్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నారు. గురువారం కంపెనీ షెడ్ పైభాగంలో రేకులు మారుస్తుండగా జారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. సోదరుడు శివ్‌జీసింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సెల్‌ఫోన్ విషయంలో తండ్రితో గొడవ.. కూతురి ఆత్మహత్య



మహాలక్ష్మి మృతదేహం

మాసాయిపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సెల్‌ఫోన్ విషయంలో తండ్రితో గొడవపడి కూతురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేటలో చోటుచేసుకుంది. ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మాసాయిపేటకు చెందిన నాగరాజుగౌడ్ కూతురు మహాలక్ష్మి (19) సెల్ ఫోన్ వినియోగం విషయంలో కుటుంబ సభ్యులతో గొడవపడింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మహాలక్ష్మి గురువారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ.. చికిత్స పొందుతూ మృతి



షాజాన్‌బీ (ఫైల్)

రాయపోల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. రాయపోల్ ఎస్సై మానస తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాయపోల్ మండలం సయ్యద్‌నగర్ గ్రామానికి చెందిన షాజాన్‌బీ(26) డబ్బుల విషయంలో తన తోటి కోడలు దూషించడంతో మనస్తాపం చెంది ఈ నెల 10న ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. తీవ్రంగా గాయపడిన ఆమెను గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవికుమార్

గజ్వేల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న గజ్వేల్ మండలం పిడిచెడ్‌కు చెందిన బీనమైన శ్రీనివాస్ తన ఇంటికి తాళం వేసి పనికి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా ఉండడంతో గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు గజ్వేల్ అదనపు ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, ఎస్సై మల్లారెడ్డి, ఏఎస్ఐ యాదగిరి, ఉమర్, కానిస్టేబుళ్లు నరేంద్ర, సురేందర్, రవి, మహిళా కానిస్టేబుల్ దివ్య గాలింపు చర్యలు చేపట్టారు. పిడిచెడ్ గ్రామానికి చెందిన బీనమైన పెద్దనాగులును అరెస్ట్ చేసి, వివరాలు రాబట్టారు. అతని వద్ద నుంచి 25 తులాల వెండి పట్టగొలుసులు, 1.4 గ్రాముల బంగారు ముక్కు పుడక, రూ.10 వేల నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి జైలు

గుమ్మడిదల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల ఎక్స్ రోడ్డులో నవంబరు 19న నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడిపిన గుమ్మడిదల గ్రామానికి చెందిన ఎరపుల శ్రీనివాస్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతడిని గురువారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ మూడు రోజుల జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, ఎవరూ ఇలాంటి చర్యలకు పాల్పడవద్దని గుమ్మడిదల ఎస్సై లక్ష్మీకాంత్‌రెడ్డి హెచ్చరించారు.

భళా.. బాల వైజ్ఞానిక ప్రదర్శన



సిద్దిపేటలో ప్రదర్శన గురించి వివరిస్తున్న విద్యార్థి

- సంగారెడ్డి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయికి 12 ప్రదర్శనలు ఎంపిక
- ముగిసిన మూడు రోజుల సైన్స్ ఫెయిర్.. విజేతలకు జ్ఞాపికలు అందజేత

నారాయణఖేడ్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయికి 12 ప్రదర్శనలను ఎంపిక చేసినట్లు సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణఖేడ్‌లో ఈ నెల 18వ తేదీ నుంచి జరుగుతున్న 53వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఈవోతోపాటు నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో ఎంత ఎదిగితే దేశం అంత అభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశం ముందుకు సాగుతుందన్నారు. అదనపు కలెక్టర్ ఉమా హారతి మాట్లాడుతూ సైన్స్ వివిధ రంగాల్లో ఎదగడానికి దోహదపడుతుందన్నారు. డీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సైన్స్ ఫెయిర్ విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ ప్రదర్శనలో మొత్తం 713 నమూనాలను ఏర్పాటు చేశారని, వాటిలో 30 ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేశామని తెలిపారు. ఇన్‌స్పైర్ అవార్డు విభాగంలో ప్రదర్శించిన 116 నమూనాలకు గాను రాష్ట్ర స్థాయికి 12 ప్రదర్శనలు ఎంపికయ్యాయన్నారు. మూడు రోజుల్లో జిల్లా నలుమూలల నుంచి మొత్తం 13,742 మంది విద్యార్థులు ఈ సైన్స్ ఫెయిర్‌ను తిలకించారని పేర్కొన్నారు.అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందించారు. ఈ సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు భోజనాలు, ఇతర సదుపాయాలు కల్పించినందుకు తక్షిలా పాఠశాల కరస్పాండెంట్ శరత్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి సిద్దారెడ్డి, డీసీబీ కార్యదర్శి లింబాద్రి, రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కళింగక్రిష్ణకుమార్ పాల్గొన్నారు.



నారాయణఖేడ్ : సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన వారికి జ్ఞాపికలు అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి తదితరులు



సిద్దిపేటలో నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు



సిద్దిపేటలో నమూనాలను ఆసక్తిగా తిలకిస్తున్న విద్యార్థులు

సిద్దిపేటలో వైజ్ఞానిక సంబురం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన రెండో రోజూ కొనసాగింది. వివిధ స్టాల్స్‌లో విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్స్ అందరినీ ఆలోచింపజేశాయి. గురువారం వివిధ పాఠశాలలకు చెందిన 4,815 మంది విద్యార్థులు ప్రదర్శనను తిలకించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ప్రత్యేక పర్యవేక్షణ అధికారి సోమిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీఎస్‌వో కల్లేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారులపై అగ్నిప్రమాదాలు

- ఇంజన్‌లో మంటలు చెలరేగి లారీ
- మరో ఘటనలో కారు దగ్ధం
- ప్రయాణికుల అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామ పరిధిలో కాలిపోతున్న లారీ

కోహీర్/చిన్నకోడూరు నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల పరిధిలోని జాతీయ రహదారులపై వరుసగా రెండు అగ్నిప్రమాదాలు జరిగాయి. ఈ ఘటనల్లో ఒక లారీ, ఒక కారు పూర్తిగా దగ్ధమయ్యాయి. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని దిగ్వాల్ గ్రామం పరిధిలో గల 65వ జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి ఓ లారీ పూర్తిగా దగ్ధమైంది. కర్ణాటక నుంచి బైండింగ్ వైర్ల లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ దిగ్వాల్ దాటిన తర్వాత ఇంజన్‌లో నుంచి పొగలు వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ లారీని రోడ్డు పక్కన ఆపి కిందికి దిగిపోయాడు. క్షణాల్లో మంటలు పెద్దవిగా మారి, లారీ మొత్తం వ్యాపించాయి. సమాచారం అందుకున్న కోహీర్ పోలీసులు, జహీరాబాద్ అగ్నిమాపక శాఖ వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే లారీ పూర్తిగా కాలిపోయింది. దాదాపు రూ.30లక్షల మేర నష్టం వాటిల్లినట్లు డ్రైవర్ తెలిపాడు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ గ్రామ శివారులోని రాజీవ్ రహదారిపై గురువారం కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. కరీంనగర్‌కు చెందిన జమీల్ అహ్మద్ తన కుటుంబ సభ్యులతో కారులో సిద్దిపేటకు వెళ్తుండగా, ఇబ్రహీంనగర్ శివారులోకి రాగానే కారు ఒక్కసారిగా ఆగిపోయి పొగలు వచ్చాయి. అప్రమత్తమైన జమీల్ అహ్మద్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో నుంచి కిందకి దిగారు. క్రమంగా కారులో మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. పోలీసులు వివరాలు సేకరించారు. కారులో ఉన్నవారు ముందే అప్రమత్తమై కిందికి దిగడంతో పెను ప్రమాదం తప్పింది.





చిన్నకోడూరు మండలం ఇబ్రహీంనగర్ శివారులో దగ్ధమైన కారు

అగ్నివీర్‌కు సింగూరు గురుకుల విద్యార్థుల ఎంపిక

పుల్కల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పుల్కల్ మండలం సింగూరు సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌కు ఎంపికయ్యారు. మునిపల్లి మండలం మనసానిపల్లి గ్రామానికి చెందిన బోయిని శివకుమార్ (ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం), మనూరు మండలం బోరంచ గ్రామానికి చెందిన బేగరి అరుణ్‌కుమార్ (ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థి) ఈ నెల 10, 11 తేదీల్లో హనుమకొండలో జరిగిన ఆర్మీ ర్యాలీలో వివిధ విభాగాల్లో తమ ప్రతిభను కనబర్చి అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. త్వరలో వీరు శిక్షణకు తరలివెళ్లనున్నారు.

పలు క్రీడాపోటీలలో సత్తా

భువనగిరి, పటాన్‌చెరు, జహీరాబాద్, మెదక్‌లలో జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలలో సింగూరు గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ ఫైనల్ పోటీల్లో పాల్గొని ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ అండర్ 19 విభాగంలో అజయ్‌కుమార్, ప్రణయ్ అత్యంత ప్రతిభను కనబర్చారు. హైదరాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరిగిన అండర్ 14 అథ్లెటిక్స్‌లో నితీష్, హనుమకొండలో అండర్ 17 అథ్లెటిక్స్‌లో రిషిఅరుణ్ వర్ధన తమ సత్తాను ప్రదర్శించారు. అలాగే, రాష్ట్ర స్థాయిలో అండర్ 17 అసోసియేషన్ క్రీడల్లోనూ మల్లేశం, రామ్‌చరణ్ నైపుణ్యాన్ని కనబర్చారు. సికింద్రాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి కబడ్డీ సబ్ జూనియర్ విభాగంలో సుమిత, నితీష్, మాణిక్యం పాల్గొనగా, పటాన్‌చెరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో జూనియర్ విభాగంలో శ్యామ్, యాదుల్, అరుణ్, ప్రశాంత్‌లు క్రీడా ప్రతిభను చాటారు. దీంతో పాటు, హత్నూరలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్యాంపస్‌లో జరిగిన 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో అండర్ 19, 17, 14 విభాగాల్లోనూ సింగూరు విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. విద్యార్థులు అగ్నివీర్‌కు ఎంపిక కావడం, స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబర్చడంపై ప్రిన్సిపాల్ ఆగమయ్య, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది సంతోషం వ్యక్తం చేసి అభినందించారు



ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ ఆగమయ్య, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ, అధ్యాపకులు

తహసీల్దార్ కార్యాలయంలో యువ రైతు ఆత్మహత్యాయత్నం

- భూమి పట్టా కోసం అఘాయిత్యం
- అడ్డుకున్న సిబ్బంది
- పట్టాదారుల అంగీకారంతో పట్టా మార్పిడికి హామీ



ఒంటిపై పెట్రోలు పోసుకున్న రైతు దూడ మల్లేశం

పుల్‌కల్, నవంబరు 20 ((ఆంధ్రజ్యోతి) : అరవై మూడేళ్లుగా తాము కబ్జాలో ఉన్న భూమికి పట్టా అమలు కావడం లేదంటూ సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఓ యువ రైతు ఒంటిపై పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చౌటకూర్ గ్రామానికి చెందిన దూడ సిద్దయ్య కుటుంబం సర్వే నంబరు 1527, 1531లో 37 గుంటల భూమిని, 1962-63 నుంచి కబ్జాలో ఉంటూ సాగుచేసుకుంటున్నారు. పట్టాదారు కాలంలో పర్వతగారి లింగారెడ్డి పేరు ఉన్నప్పటికీ, అనుభవదారు కాలంలో దూడ సిద్దయ్య పేరు నమోదై ఉంది. సిద్దయ్య మరణాంతరం ఆయన కుమారులు దూడ మాణయ్య, మల్లేశం సాగు చేస్తున్నారు. 2007లో సింగూరు ప్రాజెక్టు కాలువ తవ్వకంలో ఎనిమిది గుంటల భూమిని కోల్పోగా, అప్పుడు కబ్జాదారులుగా ఉన్న దూడ మాణయ్య, మల్లేశంకు అధికారులు విచారణ జరిపి రూ.47వేలు నష్టపరిహారం చెక్కును అందజేశారు. అయినప్పటికీ, మిగిలిన 29 గుంటల భూమిని తమ పేరున అమలు చేయాలంటూ దూడ మాణయ్య అతని కుమారుడు దూడ మల్లేశం ఏళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాడు. కలెక్టర్ మొదలుకుని ఆర్డీవో, తహసీల్దార్ వరకు వినతులు ఇచ్చి విసిగి వేసారిపోయాడు. ఈ నేపథ్యంలో, తన ఆత్మహత్యతోనైనా భూమిని అమలు చేస్తారేమోనని భావించిన మల్లేశం, గురువారం పెట్రోలు డబ్బా, సూసైడ్ నోట్ తీసుకుని తహసీల్దార్ కార్యాలయానికి వచ్చాడు. ముందుగా తహసీల్దార్ నామాల కిష్టయ్య ఛాంబర్‌లోకి వెళ్లి ఆయనకు సుసైడ్ నోట్ ఇచ్చి, ఒంటిపై పెట్రోలు పోసుకున్నాడు. అక్కడే విధుల్లో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ మీనా వెంటనే అప్రమత్తమై పక్క గదిలో ఉన్న నయాబ్ తహసీల్దార్ శ్రీమాన్, గిర్దావర్ ప్రమోద్‌కుమార్‌లకు చెప్పడంతో వారు అక్కడికి చేరుకుని మల్లేశం ఒంటిపై నీళ్లు పోసి అదుపు చేశారు.

కుదిరిన రాజీ

ఈ విషయమై రెవెన్యూ అధికారులు పట్టాదారులైన లింగారెడ్డి కుటుంబ సభ్యులను పిలిపించి మాట్లాడారు. చాలా రోజులుగా దూడ సిద్దయ్య కుటుంబీకులే కబ్జాలో ఉన్నది నిజమేనని వారు అంగీకరించారు. దీనిపై ఇరువర్గాల మధ్య చర్చలు జరిగాయి. పది రోజుల్లోగా పట్టా మార్పిడి చేసిస్తామంటూ లిఖితపూర్వకంగా లింగారెడ్డి కుటుంబ సభ్యులు రాసివ్వడంతో ఇరువర్గాల మధ్య రెవెన్యూ అధికారులు రాజీ కుదిర్చి గొడవను సద్దుమణిగించారు.

పలు రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



చేగుంట : రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

చేగుంట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేగుంట మోడల్ స్కూల్‌లో గురువారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎస్జీఎఫ్ ఫెన్సింగ్ పోటీలు జరిగాయి. ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రకళ ఈ పోటీలను ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొనగా, వారిలో మొత్తం 72 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి టోర్నమెంట్లకు ఎంపికయ్యారు. ఈ నెల 21 నుంచి 25 వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో రాష్ట్రస్థాయి పోటీలు జరుగుతాయని ఆర్గనైజింగ్ సెక్రటరీలు నాగరాజు, సౌందర్య, శ్రీనివాస్, గణపతి, సమ్మయ్య, గణేష్, రవికుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో మెదక్ జిల్లా ప్రతిభను చాటాలని వారు క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెఫరీలు మల్లీశ్వరి, కౌండిన్య, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు మంజీర విద్యార్థులు..

రామాయంపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలలో రామాయంపేట మంజీర విద్యాలయం విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. బుధవారం సాయంత్రం వరకు మెదక్ పట్టణంలో జరిగిన అండర్-17 విభాగం పోటీలలో మంజీర విద్యాలయానికి చెందిన అభివరుణ్, వినయ్ జడ్చర్లలో జరగనున్న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు.

యోగా పోటీల్లో ఆకునూరు విద్యార్థుల ప్రతిభ

చేర్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్‌కు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల కరీంనగర్ జిల్లా వెలిశాలలో నిర్వహించిన ఈ పోటీలలో పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎన్. సాత్విక, పి. అవంతిక జిల్లా జట్టు తరఫున పాల్గొన్నారు. సాత్విక అండర్-17 బాలికల ఆర్టిస్టిక్ యోగా సింగిల్ విభాగంలో ద్వితీయ స్థానం సాధించింది. సాత్విక, పి. అవంతిక ద్వయం యోగా పెయిర్, రిథమిక్ యోగా పెయిర్ అండర్-17 బాలికల విభాగాలలో ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ మేరకు గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఉపాధ్యాయులు, ఏఏపీసీ సభ్యులు అభినందించారు.



చేర్యాల : విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కేతకీలో భక్తుల కోలాహలం



ఝరాసంగం : స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- మాజీ డీజీపీ దినేశ్ రెడ్డి పూజలు

ఝరాసంగం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమావాస్య సందర్భంగా భక్తుల ప్రత్యేక పూజలతో ఆలయ ఆవరణం కోలాహలంగా మారింది. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం అమృత గుండంలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ చంద్రశేఖర్, ఆలయ ఈవో శివరుద్రప్ప ప్రత్యేక చర్యలు చేపట్టారు. కేతకీ ఆలయంలో మాజీ డీజీపీ దినేశ్ రెడ్డి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో వారికి స్వాగతం పలికారు. ఆలయ అధికారులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

బగలాముఖిని దర్శించుకున్న మధుయాష్కి

శివ్వంపేట, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అమావాస్య, కార్తీక మాసం చివరి రోజు సందర్భంగా బుధవారం శక్తిపీఠం శ్రీ బగలాముఖి అమ్మవారిని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, మహామంత్రహవనం నిర్వహించారు. మాజీ ఎంపీ మధు యాష్కి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి కమలేష్ పండిత్ ఆలయ విశిష్టతను మధు యాష్కీకి తెలియజేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, తాజా మాజీ జడ్పీటీసీ మహేష్ గుప్తా, నాయకులు పాల్గొన్నారు.

కలియదున్నితే కలదు బలం



- వరికొయ్యలను తగలబెడితే భూసారానికి నష్టం
- మేలు చేసే సూక్ష్మజీవులు, కీటకాలు నశిస్తాయి
- కాలుష్యంతో పర్యావరణానికీ ముప్పు
- పొలంలోనే కలియదున్నాలంటున్న నిపుణులు

తొగుట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరిపంట కోసిన తర్వాత మిగిలిన వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల భూసారానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల సమృద్ధిగా వర్షాలు కురవడంతో జిల్లాలోని దుబ్బాక, గజ్వేల్, సిద్దిపేట వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలోని పలు గ్రామాల రైతులు యాసంగి పంట సాగు కోసం తమ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. యంత్రాల ద్వారా వరి కోతలు కోయడం వల్ల వరి కొయ్యలు పొలంలో ఎక్కువ ఎత్తులో మిగిలిపోతున్నాయి. దీనివల్ల పొలాన్ని దున్నడం కష్టంగా మారడంతో రైతులు ఈ వ్యర్థాలకు నిప్పు పెట్టి కాల్చివేస్తున్నారు. అయితే, ఇది వాతావరణ కాలుష్యానికి దారి తీయడమే కాక, భూమి తన సహజ సారాన్ని కోల్పోతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. గతంలో కూలీలను పెట్టి కోయించడం వల్ల పశువులకు గడ్డి లభించేది, కొయ్యలు కూడా చిన్నగా ఉండేవి. ఆ కొయ్యలను పొలంలో కలియ దున్ని నీరు పారించడంతో అవి కుళ్లిపోయి భూమి సారవంతమయ్యేది.

భూసారం తగ్గిపోతోంది

వరి కొయ్యలను కాల్చడం వల్ల పొలంలో పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు, క్రిమి కీటకాలు నశించిపోతాయి. దీని ఫలితంగా నేల తన సహజ స్వభావాన్ని కోల్పోయి క్రమంగా సారవంతం తగ్గుతుంది. భూసారం తగ్గడం వల్ల పంట దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా, వరి కొయ్యలను పొలంలోనే కలియ దున్నడం వల్ల అవి కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారతాయి. దీనివల్ల భూసారం పెరిగి, అధిక దిగుబడి సాధించేందుకు వీలవుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. వరి కొయ్యలను కాల్చివేసేటప్పుడు నిర్లక్ష్యంగా ఉంటే, పొలంలోని విద్యుత్ వైర్లు, మోటార్లు, నీటి పైపులు కాలిపోయి రైతులు నష్టపోవాల్సిన సందర్భాలు ఉన్నాయి. కాబట్టి, రైతులు ఈ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.



ఇలా చేస్తే మేలు..

వరి కోసిన తర్వాత పంట వ్యర్థాలను తగులబెట్టకుండా, పొలానికి కొద్దిగా నీటి తడులు ఇచ్చి, సూపర్ ఫాస్ఫేట్ చల్లుకుని, ట్రాక్టర్ కేజీ వీల్స్‌తో దున్నాలని చెబుతున్నారు. ఈ విధానం ద్వారా పంట వ్యర్థాలు భూమిలో కలిసిపోయి కుళ్లిపోతాయి. ఆ తర్వాత కొద్ది రోజులు భూమిని ఆరబెట్టి, పంట సాగుకు సిద్ధం చేసుకుంటే రైతులకు మేలు జరుగుతుంది. ఈ పద్ధతి పాటించడం వల్ల వాతావరణ కాలుష్యాన్ని నివారించడంతో పాటు భూమికి సారాన్ని అందించినట్లవుతుంది.

అవగాహన కల్పిస్తున్నాం..



వరి పంటను కోసిన తర్వాత వరి కొయ్యలను పొలాల్లోనే కలియ దున్నాలి. వరి కొయ్యలను కాల్చివేయడం వల్ల జరిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. వ్యర్థాలు కాల్చడం వల్ల మిత్ర పురుగులు, శత్రు పురుగులు కూడా నశిస్తాయి. దీనివల్ల భూసారం తగ్గి దిగుబడులు తగ్గుతాయి.

-కొంపాటి మల్లయ్య, ఏడీఏ దుబ్బాక

వెలగని హైమాస్ట్ లైట్లు..!

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రజలు
● పట్టించుకోని సంబంధిత అధికారులు

చిన్నకోడూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరు మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి వివేకానంద విగ్రహం సమీపం వరకు ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్‌ల పై ఉన్న హైమాస్ట్ లైట్లు అక్కడక్కడ కొన్ని కొద్ది రోజులుగా వెలగడం లేదు. మండల కేంద్రంలో ప్రధాన రహదారి కావడంతో పాటు సిద్దిపేట - ఇల్లంతకుంటకు ఇదే రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహన దారులు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. హైమాస్ట్ లైట్లు కొన్ని వెలగక పోవడంతో రాత్రి వేళలో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి పూట చీకటిలో కనబడక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు, కాలినడకన వెళ్లే వారు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లైట్లు వెలుగకపోవడంతో వాహనాల వెలుతురులోనే ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెడిపోయిన లైట్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంలో మరమ్మతుకు గురైన వాటిని రిపేర్ చేయించడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రధాన రహదారిలోని అన్ని హైమాస్ట్ లైట్లు వెలిగేలా చూడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


చిన్నకోడూరులోని మసీదు సమీపంలో హైమాస్ట్ లైట్లు వెలుగకపోవడంతో అలుముకున్న చిమ్మ చీకటి

అకౌంటెంట్ ఉద్యోగానికి దరఖాస్తులు

కొమురవెల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి కేజీబీవీ పాఠశాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేయుటకు సిద్దిపేట జిల్లాకు చెందిన అర్హులైన మహిళ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఈ నెల 24వ తేది సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు చేసుకోవచ్చనీ తెలిపారు. బీకాం, ఎంకాం విద్యార్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.

విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

గజ్వేల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయాల వారోత్సవాల ముగింపు సందర్భంగా లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి


హైదరాబాద్‌లో మంత్రి వివేక్‌వెంకటస్వామికి వినతిపత్రాన్ని అందజేస్తున్న అందె గ్రామజేఏసీ నాయకులు

సిద్దిపేట, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఇరవైఏళ్ల క్రితం వేసిన రోడ్లకు మళ్లీ మరమతు పనులను చేపట్టాలని గురువారం కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శీనివాస్‌రెడ్డి మిరుదొడ్డి మండలం అందె గ్రామజేఏసీ నాయకులు రాజు, సోమేశ్వర్‌రెడ్డి గ్రామస్థులతో కలిసి హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామిని పూర్వదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో తమ గ్రామ అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి హయాంలోనే అందె గ్రామానికి రోడ్లు వేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గ్రామంలోని సమస్యలపై సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

కల్యాణానికి ఏర్పాట్ల పరిశీలన

కొమురవెల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జున స్వామి కల్యాణానికి ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు కలుగకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు,వాహనాల పార్కింగ్ సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు ఏర్పాట్లలో భాగంగా గురువారం సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ అధ్వర్యంలో కొమురవెల్లి మండలకేంద్రంలో,ఆలయ పరిసరాల్లో రద్దీ ప్రాంతాలను,వన్‌వే దారులను,పార్కింగ్ స్థలాలను పరిశీలించారు.రాజీవ్ రహదారి కొమురవెల్లి కమాన్ దగ్గర ట్రాఫిక్ కంట్రోల్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. కల్యాణం,బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీపీ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మురళి,ఎస్సై నీరేష్,తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సోమిరెడ్డి

కొమురవెల్లి, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): పాఠశాల పరిసరాల పరిశుభ్రత, ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ఉద్దేశించిన 5.0 కార్యక్రమంలో భాగంగా గురువారం మ్రిమును స్కూల ఉన్నత పాఠశాలను జిల్లా పరిశీలకులుగా నియామకమైన రాష్ట్ర ఓపెన్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల పరిసరాలను, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడం, అభ్యసనలో విద్యార్థులు వెనుకబడి ఉండటాన్ని ఆయన గమనించారు.

నడుంబిగించిన బొప్పాపూర్ యువత

సిద్దిపేట, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): ఆ రహదారి ప్రమాదంగా మారింది.. రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన చెట్లపొదలతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపంచడంలేదు. రాత్రిల్లు ఆ రహదారి వెంట వెళ్లాలంటే, ప్రమాదాన్ని చవిచూడక తప్పడం లేదు. దీంతో అక్బర్‌పేట- భూంపల్లి మండలం బొప్పాపూర్ గ్రామ యువత నడుంబిగించారు. ప్రభుత్వం స్పందించేవరకు ప్రమాదాలు ఆగవనే ధృడ నిశ్చయంతో గురువారం జేసీబీతో తొలగించి, శ్రమదానం చేపట్టారు. దుబ్బాక మండలం ఆకారం నుంచి అక్బర్‌పేట-భూంపల్లి మండలం బొప్పాపూర్ శివారు వరకు సుమారు 5కిలో మీటర్ల వరకు చెట్ల పొదలను, ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలను తమ సొంత డబ్బులను వెచ్చించి, జేసీబీతో కత్తిరించి, శ్రమదానంతో తొలగించారు. గ్రామానికి వచ్చే ఆర్‌టీసీ బస్‌లకు స్కూల్‌బస్‌లకు, దీచక్రవాహనాలు ప్రమాదాల బారిన పడకుండా శ్రమదానం చేపట్టారు. ఈకార్యక్రమంలో యువకులు ఆరిగే కృష్ణ, మాదవనేని బానురావు, హరికృష్ణగౌడ్, మంగళినరేష్ తదితరులున్నారు.


బొప్పాపూర్‌లో రోడ్డుకు ఇరువైపుల ఏపుగా పెరిగిన చెట్లపొదలను తొలగిస్తున్న యువకులు

మహిళా శక్తి చీరల పంపిణీపై సీసీ, వీవోఏలకు అవగాహన

మద్దూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ కోటి మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉచితంగా చేపట్టనున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాంమోహన్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని జాగృతి కార్యాలయంలో ఏపీఎం ప్రకాశం అధ్యక్షతన సీసీలు, వివోఏలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలంలో 10044 మంది మహి ళలు సంఘాల్లో ఉన్నట్లు తెలిపారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఏపీఎం, ఎంఎస్ అధ్యక్షురాలు కమిటీగా కార్యక్రమం సక్రమంగా జరిగేలా పర్యవేక్షిస్తారని తెలిపారు.

తడి,పొడి చెత్తసేకరణ పై అవగాహన సదస్సు

చేర్యాల, నవంబరు 20 (ఆంధ్ర జ్యోతి): తడి, పొడి చెత్తసేకరణ పట్ల చేర్యాల మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు, రీసోర్స్‌పర్సన్స్‌కు గురువారం స్థానిక రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ నాగేందర్ మాట్లాడుతూ.. ప్రతీ ఇంటినుంచి తడి,పొడి చెత్తను వేరువేరుగా సేకరించాలని, ఈవిషయమై ప్రజలకు తగువిధంగా సూచన ఇవ్వాలని తెలిపారు. పట్టణాన్ని సంపూర్ణ పారిశుద్ధ్యంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

జగదేవ్‌పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో రామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఈజీఎస్ పనులను ఆయా శాఖల అధికారులతో మండల కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

కొమురవెల్లి,నవంబరు20(ఆంధ్రజ్యోతి): మహిళ అభివృద్ధి శిశు సంక్షేమశాఖ సిద్దిపేట వారి ఆధ్వర్యంలో గురువారం కొమురవెల్లి కేజీబీవీ విద్యార్థులకు మహిళలకు ఉన్న చట్టాలు, బాల్య వివాహల వల్ల కలిగే అనార్థాలు, లింగ సమానత్వం, హెల్ప్‌లైన్ నంబర్ల సేవల గురించి అవగాహన కల్పించారు.

ఆకునూరు బాధితులకు "జంగిటి" ఆర్థిక సాయం

చేర్యాల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్యాస్‌సిలిండర్ పేలిన సంఘటనలో తీవ్ర గాయాలపాలై సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన శెట్టె భాస్కర్, అతడి కుటుంబీకులను బీఆర్ఎస్ నాయకుడు జంగిటి భిక్షపతి గురువారం పరామర్శించారు. వైద్యసేవలను అడిగితెలుసుకుని ఆర్థికసహాయం అందచేశారు.

అంగన్‌వాడీ సమస్యలపై దిశా కమిటీ సమావేశంలో చర్చిస్తాం

● దిశా కమిటీ మెంబర్ రవీందర్ రెడ్డి

దౌల్తాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల అంగన్‌వాడీ సమస్యలపై దిశా కమిటీ దృష్టికి తీసుకెళ్లి, కమిటీ సమావేశంలో చర్చించి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని జిల్లా దిశా కమిటీ మెంబర్ రవీందర్ రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట అంగన్‌వాడీ సెంటర్లను, ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దిశా కమిటీ మెంబర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం నిధులను మొదటి ప్రాధాన్యం విద్యపై ఖర్చు చేసి విద్యాభివృద్ధికి కృషి చేసే విధంగా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. దొమ్మట ప్రాథమిక పాఠశాల కు గేటు లేకపోవడం వల్ల పాఠశాలలో మద్యం సేవించడం, చింతపండు,మిరపకాయలు మామిడి తరుగు, ఆరబెడుతున్నారు. తదితర అసాంఘిక కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. పాఠశాలకు గేటు నిర్మించే విధంగా అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు.

లద్నూరు ఏఈవో పై ఏడీఏకు ఫిర్యాదు

మద్దూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : విధులకు సక్రమంగా హాజరు కాకుండా లద్నూరు క్లస్టర్‌కు రాజీనామా చేయనున్నట్లు తెలిపిన ఏఈవో అనూషపై ఏడీఏ రాధికకు ఫిర్యాదు చేసినట్లు ఏవో రామకృష్ణ తెలిపారు. ఏవో మాట్లాడుతూ.. ఇరువై రోజులుగా విధులకు సక్రమంగా హాజరుకావడం లేదని రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంటకు టోకెన్లు అందివ్వడంలో ఇబ్బందులు ఎదురువుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఏడీఏకు సమాచారం అందించినట్లు తెలిపారు.

దేవాదాయ శాఖ ఉప కమిషనర్ విచారణ

హుస్నాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయ 4.04 ఎకరాల భూమిపై గురువారం దేవాదాయ శాఖ వరంగల్ జోన్ ఉప కమిషనర్ కెఎన్. సంధ్యారాణి విచారణ జరిపారు. ఆలయ స్థలాన్ని పరిశీలించారు. జరుగుతున్న అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. దీనికి ముందు రేణుకా ఎల్లమ్మ దేవిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, ఇన్స్‌పెక్టర్ విజయలక్ష్మీ, ఆలయ ఇఓ కిషన్‌రావు, షరిఫోద్దిన్, చిత్తారి రవీందర్, పూదరి లక్ష్మీనారాయణ, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, వరప్రసాద్, ఆలయ అర్చకులు తాటికొండ పరమేశ్వర్ తదితరులున్నారు.

'మిత్తి'మీరుతోంది

(5వ పేజీ తరువాయి)

వసూలు చేస్తూ ప్రజలను దోచుకుంటున్నారు. గజ్వేల్ మండల పరిధిలో ఫైనాన్స్‌లు, పాన్ బ్రోకర్లతో కలిపి మొత్తం 70 వరకు మనీలాండరింగ్ లైసెన్స్‌లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ముద్ర లోన్లపై బ్యాంకుల మొండి వైఖరి

చిరు వ్యాపారులకు ఆసరాగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ముద్ర రుణాల మంజూరుకు బ్యాంకర్లు అనేక కొర్రీలు పెడుతున్నారు. వ్యాపార లైసెన్స్ ఉండాలని, ష్యూరిటీ కావాలని ఒత్తిడి చేయడంతో పాటు, ముద్ర రుణాలపై అవగాహన కల్పించకపోవడంతో చిరు వ్యాపారులు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వైపు మళ్లుతున్నారు. బ్యాంకర్ల ఈ వైఖరి వడ్డీ వ్యాపారులకు వరంగా మారుతోంది. ముక్కు పిండి వడ్డీని వసూలు చేసేందుకు ఇదే వారికి ఆసరా అవుతోంది.

అవగాహనే ప్రధానం!

ప్రభుత్వ రంగ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి రకరకాల ఆంక్షలు పెట్టడం, రుణం మంజూరులో తీవ్ర జాప్యం చేయడంతో విసిగిపోయిన చిరు వ్యాపారులు ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించడం అనివార్యమవుతోంది. అయితే, అప్పులు తీసుకునే ముందు సదరు సంస్థ లేదా వ్యక్తికి సంబంధించిన నిబంధనలు, వడ్డీ రేట్లను ముందుగానే క్షుణ్ణంగా తెలుసుకోవాలని ఆర్థిక, న్యాయ నిపుణులు సూచిస్తున్నారు. బ్యాంకర్లు ముద్ర రుణాలపై చిరు వ్యాపారులకు అవగాహన కల్పించి, రుణాలను సులభతరం చేయాలని, అలాగే వడ్డీ వ్యాపారుల ఆగడాలను అరికట్టేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని చిరు వ్యాపారులు కోరుకుంటున్నారు.

సైడ్‌బర్మ్ గుంతలు పూడ్చివేత

చేర్యాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): చేర్యాల-నాగపురి ప్రధానరహదారిపై పలు ప్రదేశాలలో గుంతలు ఏర్పడి సెడ్‌బర్మ్‌లు కోతకు గురై ప్రమాదాలకు నిలయంగా మారింది. పట్టించుకున్ననాథుడే లేకపోవడంతో పట్టణానికి చెందిన మలిశెట్టి యశ్వంత్ గురువారం మట్టి, మొరంతో పూడ్చివేయించి ఉదారత్వాన్ని చాటుకున్నాడు. సైడ్‌బర్మ్‌ల కోతల కారణంగా ఓ వాహనం ఎదురువస్తే మరో వాహనం నిలుపుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నా అధికారులెవరూ ప్రత్యామ్నాయచర్యలు చేపట్టకపోవడంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులుపడుతున్నారు. ఈవిషయమై మలిశెట్టి యశ్వంత్ సొంతడబ్బులు వెచ్చించి పలు ప్రదేశాలలో మొరం పోయించి చదును చేయించడంతో ప్రయాణికులు తాత్కాలికఉపశమనం పొందారు. ఈ మేరకు అతడిని స్థానికులు అభినందించారు.


మట్టి,మొరంతో సైడుబర్మ్ గుంతలు పూడ్చివేయిస్తున్న మలిశెట్టి యశ్వంత్

పనులు తక్షణమే ప్రారంభించాలి

హుస్నాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి నెలలు గడచినా ఇప్పటికీ పనులు ప్రారంభించడం లేదని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లిఖార్జున్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించని పలు సీసీ రోడ్లను పరిశీలించారు. మున్సిపల్‌లో ప్రతి వార్డులో మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 50 లక్షలు కేటాయించారని, కానీ పనులు మాత్రం ప్రారంభించడం లేదన్నారు. పలు కాలనీల్లో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఈ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు

వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తాం

జగదేవ్ పూర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రత్నాశ్రీ భారత్ గ్యాస్ 17వ వార్షికోత్సవ వేడుకల్లో డీలర్ సంజయ్‌గుప్త మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమన్నారు. 16 ఏళ్లుగా జగదేవ్‌పూర్‌తో పాటు గజ్వేల్, మర్కుక్, ములుగు, వర్గల్ మండలాలకు సకాలంలో సిలిండర్‌ల సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఉజ్వల శ్రీ పథకం కింద ఉచిత కనెక్షన్‌లను అందిస్తున్నట్లు, ఏ సమస్యలైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.


భారతగ్యాస్ గోదాం వద్ద మాట్లాడుతున్న డీలర్ సంజయ్‌గుప్త

మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు

గజ్వేల్ రూరల్ నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మానవ తప్పిదాల వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని జీఎంఆర్ జూనియర్ కాలేజీలో చదువుతున్న విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్ ఎల్లలకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను కోరారు. రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై జరిమానాలు విధిస్తామని, అయితే జరిమానా విధించడం తమ అభిమతం కాదని, ప్రమాదాల నివారణే లక్ష్యమని తెలిపారు.

హామీల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

హుస్నాబాద్ టౌన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలో ఈ నెల 28వ తేదీన సూర్యపేట జిల్లా కేంద్రంలో జరిగే కల్లు గీత కార్మికుల బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. తాటి చెట్టు పై నుంచి పడి చనిపోయిన గీత కార్మికులకు రెండు సంవత్సరాలు గడచినా ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదన్నారు. గీత కార్మికుల పాత పెన్షన్ పెంపు లేదని ఇలా అనేక సమస్యలపై ప్రభుత్వం ఒత్తిడి పెంచేందుకు ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు.

ధర.. దడ

(5వ పేజీ తరువాయి)

నుంచి ఉపాధి కోసం వలస వచ్చిన కార్మికులు కూడా ఇందులో ఉన్నారు. ఇసుక కొరత, ధరల పెరుగుదల కారణంగా అనేక నిర్మాణ పనులు ఆగిపోవడంతో ఈ కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కార్మికులు రోడ్డున పడుతున్నారు. పెద్ద బిల్డింగ్‌లు, అపార్ట్‌మెంట్‌ల నిర్మాణాలు మినహా, సామాన్య, మధ్యతరగతి ప్రజలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలన్నీ ఇసుక భారం మోయలేక నిలిచిపోయాయి.

ఇందిరమ్మ ఇళ్లపైనా ప్రభావం

పేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంపై కూడా ఇసుక ధరల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇసుక అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సామాన్యుడికి ఇసుక అందని ద్రాక్షలా మారింది. ఉచితంగా కాదు కదా, కనీసం సరసమైన ధరలకు కూడా ఇసుక దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇసుకకు డబ్బులు లేక పలు చోట్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు కూడా మధ్యలోనే ఆగిపోయాయి.

నియంత్రణకు చర్యలు శూన్యం

రోజురోజుకు పెరుగుతున్న ఇసుక ధరలను నియంత్రించి, ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్‌కు తగ్గ సరఫరాను అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడం వల్లే వ్యాపారుల దోపిడీకి అడ్డుకట్ట పడడం లేదు. మైనింగ్, రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే స్పందించి, కృత్రిమ కొరత సృష్టిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇసుకను పేద, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని భవన నిర్మాణ యజమానులు, కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

ప్రభుత్వ అధికారులు స్పందించాలి



పేద, మధ్య తరగతి ప్రజలకు నిర్ణీత ధరకు అందుబాటులో ఉండాల్సిన ఇసుకను కొందరు వ్యాపారులు కావాలని కృత్రిమ కొరత సృష్టించి డబ్బులు సంపాదిస్తున్నారు. దీనివల్ల అటు ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకరావడంతో పాటు, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి దొరకకుండా చేస్తున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తమై స్పందించాలి. బాధ్యులైన వారిపై శాఖ పరంగా క్రిమినల్ కేసులు నమోదు చేయాలి.

- దరిపల్లి చంద్రం, బీఎస్ఆర్‌కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు

కలెక్టరేట్ ఎదుట ధర్నా జయప్రదం చేయండి

సిద్దిపేట అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : భవననిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు స్కీములను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పి నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నవంబరు 25న చేపట్టే కలెక్టరేట్ ధర్నాను భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బీసీ డబ్ల్యూ యు జిల్లా ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ పిలుపునిచ్చారు . గురువారం స్థానిక కార్మిక కర్షక భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నెంబర్ 12ను సవరించి బోర్డు నిధులను కార్మికుల కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

దౌల్తాబాద్ పీఏ సీఎస్ చైర్మన్‌కు సత్కారం

దౌల్తాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం యూనియన్ భవనంలోని 72వ వారోత్సవాలు హైదరాబాద్‌లో జరిగాయి. ఈ సందర్భంగా దౌల్తాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏ సీఎస్) చైర్మన్ గా 30 ఏళ్ల పాటు సేవలందించి విశేషంగా కృషిచేసిన అన్నారెడ్డి గారి వెంకటొరెడ్డిని యూనియన్ ఎండీ చేతుల మీదుగా శాలువాతో సత్కరించి అవార్డు అందజేసినట్లు దౌల్తాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యదర్శి మల్లేశం తెలిపారు.

విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే సైన్స్ ఫెయిర్


సిద్దిపేట సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొన్న విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి

ములుగు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకే సైన్స్ ఫెయిర్ ఉపయోగపడుతుందని విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి అన్నారు. గురువారం ములుగు మండలం బండతిమ్మాపూర్ విద్యార్థులు సిద్దిపేటలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్నారు. జిల్లా స్థాయి ఇన్స్పైర్, సైన్స్ ఫెయిర్‌ను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాలపై నైపుణ్యాన్ని వెలికితీయడం లక్ష్యమన్నారు. ప్రతి విద్యార్థి ప్రత్యేక శ్రద్ధ వహించి చదవాలన్నారు.

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ మండల అధ్యక్షుడిగా రాజేందర్ రెడ్డి

సిద్దిపేట రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫొటోగ్రాఫర్స్ యూనియన్ నారాయణరావుపేట మండల అధ్యక్షుడిగా కయ్యాల రాజేందర్‌రెడ్డి ఏక్రగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. గురువారం నారాయణరావుపేట మండల కేంద్రంలో ఫోటో గ్రాఫర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా కయ్యాల రాజేందర్ రెడ్డి, ఉపధ్యక్షుడిగా నాంపల్లి మధు, ప్రధాన కార్యదర్శి దండు ప్రశాంత్, కోశధికారి పుర్ర నరేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, మహేష్, తిరుపతిరెడ్డి, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం గాంధీనగర్‌లో గురువారం హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శ్రమదానంతో రోడ్డుకు ఇరువైపుల ఉన్న పిచ్చిచెట్లను తొలగించారు. జాతీయ సేవాపథకం శీతాకాల శిబిరంలో భాగంగా నాలుగు రోజులు విద్యార్థులు ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు వెల్లే దారిలో ఉన్న పిచ్చిపొదలను తొలగించి శుభ్రం చేశారు. రోడ్డు ప్రక్కన ఉన్న ప్లాస్టిక్ కవర్లు తొలగించారు. గుంతలుగా ఉన్న రోడ్డును చదునుచేశారు. ప్రభుత్వ పాఠశాల ఆవరణాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన

సిద్దిపేట అర్బన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని గురువారం సిద్దిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ విషయాలను తెలుసుకున్నారు. దశలవారీగా నిర్మాణం అయిన ఇళ్ల ఫోటో క్యాప్చర్ త్వరగా చేసి లబ్ధిదారులకు డబ్బులు అందేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. అనంతరం మేస్త్రీలతో మాట్లాడారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తో సాకారం

బెజ్జంకి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి):పేదవారి సొంతింటి కలను సాకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రవేశపెట్టిందని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బెజ్జంకి మండలంలోని వీరాపూర్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద నిర్మాణాలు పూర్తైన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమానికి గురువారం ఎమ్మెల్యే సత్యనారాయణ హాజరయ్యారు.

నేడు విద్యుత్ అంతరాయం

సిద్దిపేట రూరల్, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండల కేంద్రంలో 33 కేవీ విద్యుత్ లైన్ మరమతుల రీత్యా నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీఈ పి.శ్రీనివాస్ గురువారం నాడు తెలిపారు.

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు


గజ్వేల్ పట్టణంలో రోడ్లపై పెట్టిన సామగ్రి తీయిస్తున్న సీఐ మురళి

గజ్వేల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని పలు రోడ్లలో రోడ్లపై, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలకు సంబంధించి సామగ్రి, ఇతర వస్తువులు పెట్టిన వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్లను, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి సామగ్రి పెట్టవద్దని, ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించాలని సూచించారు.

నిబంధనలు పాటించని వ్యాపారులపై చట్టప్రకారం కేసులు నమోదు చేయబడతాయని ఆయన హెచ్చరించారు.